క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

నారాయణపేట రూరల్ : మండలంలోని పేరపళ్ల ఉప విద్యుత్ కేంద్రంలో శనివారం ఉదయం 11గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు 33/11 కేవీ మరమ్మతు వలన విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ సాయినాథ్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. రైతులు, గృహ వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

24న పంచాయతీ దుకాణాల వేలం

మరికల్: ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న మండలంలోని గ్రామ పంచాయతీ దుకాణాల వేలం పాటను ఈ నెల 24న నిర్వహిస్తున్నట్లు కార్యదర్శి శ్యాంసుందర్‌రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సిమెంట్ కప్పు దుకాణాలకు రూ. 10వేలు, డబ్బాలకు రూ. 5వేల చొప్పున బ్యాంక్‌లో డీడీలు కట్టి చలాన్ తీసుకొచ్చి వేలంలో పాల్గొనాలని సూచించారు.

స్పోర్ట్స్ కిట్స్ అందజేత



మాగనూర్: మండలంలోని నేరడగం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు స్పోర్ట్స్ కిట్స్‌ను వితరణ చేసినట్లు పాలమూరు ఎన్నారై ఫోరం టీం సభ్యులు ఫార్మర్ శ్యాం తెలిపారు. ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు వీటిని సద్వినియోగం చేసుకుని క్రీడల్లో రాణించాలన్నారు. ఈ మేరకు.. పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు టీం బృందానికి కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉపాధి కూలీల సమస్యల పరిష్కారం



మాగనూర్: ఉపాధిహామీ పథకం కూలీల సమస్యలను గ్రామస్థాయిలోనే పరిష్కరించే దిశగా అడుగులు వేసినట్లు ఇన్‌చార్జి ఎంపీఓ హర్షవర్ధన్ అన్నారు. శుక్రవారం మండలంలోని నేరడగంలోని గ్రామ పంచాయతీలో గ్రామస్తుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. జాబ్‌కార్డు, ఖాతాలకు సంబంధించి సమస్యలను అక్కడే పరిష్కరించి, కొత్త జాబ్‌కార్డు నూతన సభ్యులను చేర్పించి సమస్యలు పరిష్కరించారు. దీంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రహ్మతుద్దీన్, కంప్యూటర్ ఆపరేటర్ బాలు, పంచాయతీ కార్యదర్శి అర్జున్, ఫీల్డ్ అసిస్టెంట్ కురుమప్ప పాల్గొన్నారు.

రెండో రోజు సాగిన సామాజిక తనిఖీ



మాగనూర్: మండల పరిధిలోని నేరడగంలో 2023–04 ఉపాధిహామీ పనులకు సంబంధించిన సామాజిక తనిఖీలో వచ్చిన అభ్యంతరాలపై శుక్రవారం రెండోరోజు ఎంపీడీఓ రహ్మతుద్దీన్ తనిఖీ చేశారు. ఈ మేరకు.. ఆయన గ్రామంలోని ఇంటింటికీ తిరిగి ఉపాధిహామీ పనులపై సామాజిక బృందం చేపట్టిన పనులపై వచ్చిన అభ్యంతరాలను పరిశీలించి తెలుసుకున్నారు. ఉపాధికూలీలు నిర్భయంగా వచ్చి తమ సమస్యలు తెలుపాలన్నారు. రెండోరోజు సేకరించిన వివరాలను ఉన్నతాధికారులకు నివేదిక అందజేస్తామన్నారు. పంచాయతీ కార్యదర్శి అర్జున్ పాల్గొన్నారు.

వారాంతపు సెలవులు అమలు చేయాలి

మక్తల్: మున్సిపాలిటీలో పనిచేస్తున్న కార్మికులకు వారాంతపు సెలవులు అమలు చేయాలని ఇఫ్టూ ఆధ్వర్యంలో శుక్రవారం మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఇఫ్టూ జిల్లా అధ్యక్షుడు కిరణ్ మాట్లాడారు.. కార్మికులకు సబ్బులు, నూనెలు, బట్టలు, చెప్పులు ఇవ్వాలని, వారంతపు సెలవులు అమలు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం తమ సమస్యలు పరిష్కరించాలని మున్సిపల్ అధికారికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో అధ్యక్షుడు రాజు, రాములు, ఈశ్వరయ్య, అశోక్, రవి, కృష్ణయ్య, వెంకటేష్, అకాష్, మల్లేష్, బాబు, ఆంజనేయులు పాల్గొన్నారు.



వినియోగంలోకి వచ్చేదెన్నడో?

- నిరుపయోగంగా నూతన భవనం
- నిధుల లేమితో అసంపూర్తి సౌకర్యాలు
- అద్దె భవనంలో తరగతులు



ఆరుబయట
చెట్లకింద తరగతుల నిర్వహణ



నిరుపయోగంగా కొత్త భవనం

దామరగిద్ద: మండల కేంద్రంలోని బాలికల ప్రాథమిక పాఠశాల నూతన భవనం మన ఊరు–మనబడి నిధులతో నిర్మించారు. కేవలం భవనం నిర్మించి మరుగుదొడ్లు, వంటగది ప్రహరీ వంటి నిర్మాణాలు చేపట్టక పోవడంతో కొత్త భవనం నిరుపయోగంగా మారింది. మనఊరు– మనబడిలో నాలుగు గదులతో కూడిన భవనం నిర్మించేందుకు రూ. 47 లక్షల నిధులు కేటాయించారు. కాంట్రాక్టర్ ఏడాది క్రితం పనులు ప్రారంభించారు. ఇదిలా ఉండగా కలెక్టర్ కోయ శ్రీహర్ష చొరవతో రూ 7.21లక్షల ప్రత్యేక నిధులు విడుదల చేయగా కాంట్రాక్టర్ రూఫ్‌లేవల్ వరకు పూర్తిచేసిన పనులకు గోడలు, డోర్‌లు ఇతర పనులు చేపట్టి రెండు గదుల నిర్మాణం పూర్తిచేశారు. ఇక కొత్త భవనాన్ని వినియోగించుకోవాలన్నా మరుగుదొడ్డు, వంటగది, ప్రహరీ పనులు పూర్తికాక పోగా నిరుపయోగంగా మారింది.

జూన్ 14న భవనం ప్రారంభం..

నియోజకవర్గ ఎమ్మెల్యే చిట్టెం పర్ణికారెడ్డి జూన్ 14న కొత్త భవనాన్ని ప్రారంభించారు. భవనాన్ని ప్రారంభించి మూడు నెలలు గడిచినా మౌళిక వసతులు పూర్తికాక ఉపయోగంలోకి రాకపోవడంతో విద్యార్థుల తల్లిదండ్రులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

కథనాల స్పందించి..

కొత్త భవనం ప్రారంభించిన మౌళిక వసతుల నిర్మాణం లేక ఉపయోగంలోకి రాకపోవడంపై విద్యార్థులు అద్దె భవనం పడుతున్న అవస్థలపై గత జూల్ 10న 'సాక్షి'లో అద్దె భవనంలో అవస్థలు 19న బడి బాధ్యత పట్టదా ? అన్న శీర్షికల వరుస కథనాలు ప్రచురించడంతో కలెక్టర్ సిక్తా పట్నాయక్ స్పందించి మరుగుదొడ్ల నిర్మాణానికి రూ. 2.81 లక్షల ప్రత్యేక నిధులు కేటాయిస్తూ హామీ ఇవ్వడంతో కాంట్రాక్టర్ మరుగుదొడ్ల నిర్మాణం పూర్తిచేయగా సెప్టింక్ ట్యాంక్ నిర్మించాల్సి ఉంది.

ఉపయోగంలోకి తేవాలి..



అద్దె భవనంలో ఎలాంటి సౌకర్యాలు లేవు. గదులు కొరతతోపాటు మరుగుదొడ్లు, మూత్రశాలలు వంట గది సదుపాయం లేదు. చెట్ల కింద వంట చేపడుతున్నాం. కొత్త భవనంలో మౌళిక వసతులు కల్పించి ఉపయోగంలోకి తేవాలి.

- అలివేలు మంగ, హెచ్‌ఎం, దామరగిద్ద

చర్యలు తీసుకుంటాం..



కలెక్టర్ చొరవ తీసుకుని రూ. 2.81 లక్షల నిధులు కేటాయి ంచడంతో కాంట్రాక్టర్ మరుగుదొడ్లు నిర్మాణం పనులు చేపట్టారు. బిల్లు రికార్డు చేశాంఏఈ మారడంతో ఆలస్యమవుతుంది, సకాలంలో బిల్లు అందించి పనులు పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటాం. భవన నిర్మాణ పనులకు రూ.11 లక్షల బిల్లులు రికార్డు చేశాం బిల్లులు అందాల్సి ఉంది.

- సాయిలక్ష్మి, ఎంపీడీఓ

ఎల్‌ఓసీ అందజేత

ఊట్కూరు: మండలంలోని తిప్పరాస్‌పల్లి గ్రామానికి చెందిన పరుశరాం కుటుంబ సభ్యులకు శుక్రవారం ఆపరేషన్ నిమిత్తం రూ. లక్షా 90వేల ఎల్‌ఓసీని ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి అందించారు. పరుశరాం గత కొన్ని రోజులుగా అస్వస్థకు గురై హైదరాబాద్‌లోని ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే బాధితుడికి ఆపరేషన్ నిమిత్తం ఎల్‌ఓసీని అందించారు. విజ్ఞేశ్వర్‌రెడ్డి, రామకృష్ణ, మల్లేష్ పాల్గొన్నారు.



బాధిత కుటుంబానికి ఎల్‌ఓసీ అందిస్తున్న ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి

విద్యార్థికి అభినందన



కోస్గి: జాతీయస్థాయి షూటింగ్‌బాల్ పోటీలకు ఎంపికైన విద్యార్థి జగదీశ్వర్‌ను ఎస్పీ యోగేష్‌గౌతమ్, ఉపాధ్యక్షులు గోపాలం, ప్రధాన కార్యదర్శి సీహెచ్ ఐలయ్య అభినందించారు. మండలంలోని ముశ్రీఫా ఉన్నత పాఠశాలలో చదువుతున్న విద్యార్థి ఈ నెల 3నుంచి 5వరకు సంగారెడ్డిలో నిర్వహించిన రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ కనబర్చారు. జాతీయ స్థాయిలో రాష్ట్రం తరుపున జూనియర్ విభాగంలో పోటీలో పాల్గొననున్నారు. షూటింగ్‌బాల్ శిక్షణ ఇచ్చిన పీడీ పుష్పలతను శాలువాతో సన్మానించారు. క్రీడలపై విద్యార్థులు మరింత ఆసక్తి పెంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం శంకరయ్య తదితరులు పాల్గొన్నారు.

చదువుతో పాటు క్రీడల్లో రాణించాలి



విద్యార్థులను అభినందిస్తున్న టీచర్లు

నారాయణపేట రూరల్: విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో రాణించాలని జాజాపూర్ జీహెచ్‌ఎం భారతి, మైనార్టీ గురుకుల స్కూల్ ప్రిన్సిపాల్ ఖాజా మహమూద్ ఖాన్ అన్నారు. ఎస్‌జీఎఫ్ క్రీడల్లో భాగంగా అండర్ – 17విభాగంలో నిర్వహించిన వాలీబాల్ పోటీల్లో ఆయా పాఠశాలల విద్యార్థులు చక్కటి ప్రతిభ కనబరిచి జిల్లా స్థాయికి ఎంపికయ్యారు. ఈ మేరకు శుక్రవారం విద్యార్థులను అభినందించి మాట్లాడారు.. ప్రతిరోజు ఆటలు ఆడటంతో శారీరక ధ్రుడత్వం, మానసిక ప్రశాంతత లభిస్తుందన్నారు. స్పోర్ట్స్ కోటాలో ప్రభుత్వ ఉద్యోగా లు, ఉన్నత విద్యా అవకాశాలు పొందవచ్చన్నారు. ఆయా కార్యక్రమాల్లో శివకుమార్‌గౌడ్, అజిత్‌గౌడ్, నారాయణ, ఖదీర్, హరీష్, పవన్, సుదర్శన్, నివేదిత, భానుప్రకాష్, మధుసూదన్‌రావు, నర్సింహులు, శిరీష, నిర్మల పాల్గొన్నారు.

భగవద్గీత పుస్తకాలు అందజేత



మరికల్: మండలంలోని టీటీడీ ఆధ్వర్యంలో శుక్రవారం విద్యార్థులకు భగవద్గీత పుస్తకాలను అందజేశారు. ఓ ప్రైవేట్ పాఠశాలలో ఏర్పాటుచేసిన సమావేశంలో టీటీడీ సభ్యులు శ్రీరాములు మాట్లాడుతూ.. భగవద్గీత చదవడంతో విద్యార్థి దశలోని ఉన్నతమైన భావాలను అలవర్చుకోవచ్చన్నారు. కరస్పాడెంట్ వెంకటేశ్వర్లశర్మ, వినితమ్మ, కృష్ణయ్య, నరేష్, రాంచందర్‌గౌడ్ పాల్గొన్నారు.

ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన



మాట్లాడుతున్న బ్యాంక్ మేనేజర్ దుర్గాప్రసాద్

మక్తల్: ప్రతి ఒక్కరూ బ్యాంక్‌లో ఖాతాలు తెరవాలని, ఖాతాలతోపాటు ఇన్సూరెన్స్ పథకాలను భాగస్వామ్యం ఏపీజీవీబీ బ్యాంక్ మేనేజర్ దుర్గాప్రసాద్ అన్నారు. శుక్రవారం మండలంలోని మాద్వార్‌లో బ్యాంక్ లావాదేవీలపై అవగాహన కల్పించారు. ఈ మేరకు.. ఆయన మాట్లాడుతూ.. ప్రతి సంవత్సరం 436ఇన్సూరెన్స్ చేసుకోవాలని, బ్యాంక్‌లో పొదుపు చేయాలని, తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లించాలని కోరారు. సామాజిక భద్రతను లాభాలు ఏ విధంగా ఉంటాయని దానిపై ఖాతాదారులకు వివరించారు. ప్రతి ఖాతదారుడు ఏటీఎం వాడుకోవాలని, గ్రామాల్లో మినీబ్యాంకులను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో బ్యాంక్ సిబ్బంది సురేష్‌రెడ్డి, బ్యాంకు మిత్ర గుడిసే రాజు తదితరులు పాల్గొన్నారు.

సీఐకి వినతి



నారాయణపేట రూరల్: హిందూ దేవుళ్ల జోలికి వస్తే ఊరుకునేది లేదని వీహెచ్‌పీ నాయకులు హెచ్చరించారు. శుక్రవారం విశ్వహిందూ పరిషత్, శ్రీ లోకాయపల్లి లక్ష్మమ్మ ఆలయ కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం నిరసన వ్యక్తం చేసి స్థానిక పోలీస్ స్టేషన్‌లో సీఐ శివశంకర్‌ను కలిసి వినతిపత్రం అందించారు. డాక్టర్ రాంబాబు, మధుసూదన్‌రెడ్డి, లప్ప అశోక్, కన్నజగదీష్, సోమశేఖరస్వామి, సురేఖ, సువర్ణ, ప్రవీణ్, క్యాతన్ రఘునాథ్ పాల్గొన్నారు.

ఏఈఓల సమస్యలు పరిష్కరించాలి

మరికల్: ఏఈఓల సమస్యలను పరిష్కరించాలని బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్ అన్నారు. మండలంలోని శుక్రవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ ఏఈఓలు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలను ప్రభుత్వానికి విన్నవిస్తున్న పట్టించుకోవడం లేదన్నారు. సంబంధిత శాఖ మంత్రి కూడా వీరి సమస్యలపై పట్టనట్లు వ్యవహరించడం న్యాయం కాదన్నారు. నెలల తరబడి పెండింగ్‌లో ఉన్న జీతాలు వెంటనే చెల్లించి, వారి సమస్యలు పరిష్కరించాలని ఆయన డిమాండ్ చేశారు. లేని పక్షంలో బీఎస్పీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాలు చేపడుతామన్నారు.

'ఉపాధి' పనుల్లో భారీగా అక్రమాలు



శిక్షణ కలెక్టర్‌కు వివరిస్తున్న నాయకులు

మరికల్: మండలంలోని కన్మనూర్ పంచాయతీ పరిధిలో జరిగిన ఉపాధి పనుల్లో భారీగా అక్రమాలు, అవకతవకలు జరిగినట్లు తమ వద్ద ఆధారాలు ఉన్నాయని అఖిలపక్ష పార్టీల నాయకులు శుక్రవారం శిక్షణ కలెక్టర్, ఇన్‌చార్జి ఎంపీడీఓ గరిమానరులకు వినతిపత్రం అందజేశారు. అఖిలపక్షం నాయకులు వరప్రసాద్‌గౌడ్, లక్ష్మికాంత్‌రెడ్డి మాట్లాడుతూ.. కన్మనూర్ పంచాయతీ పరిధిలో 2020– 24 వరకు జరిగిన ఉపాధి పనుల్లో 71వర్క్ ఐడీలలో పెద్ద మొత్తంలో అవకతవకలు జరిగాయని ఆమె దృష్టికి తీసుకొచ్చారు. గతంలో మరికల్ మండల ఏపీఓగా పని చేసిన చంద్రశేఖర్, కన్మనూర్ ఫీల్డ్ అసిస్టెంట్ మతిన్ కలిసి ఉపాధి పనుల్లో వారు చేసిన అవినీతి అక్రమాలను ఆధారాలతో బయటకు తీసుకొచ్చినట్లు ఇన్‌చార్జి అధికారికి వివరించారు. అంతే కాకుండా వివిధ పంచాయతీలో కూడా కన్మనూర్ ఫీల్డ్ అసిస్టెంట్ కింగ్ మేకర్‌గా మారి అధికారుల అండతో అక్కడ ఉపాధి పనులు ప్రైవేట్ కూలీలతో తుతూమంత్రంగా పనులు చేసి భారీగా డబ్బులు స్వాహా చేసినట్లు వారు ఆరోపించారు. సామాజిక తనిఖీలకు వచ్చిన అధికారులను బుట్టలో వేసుకొని ఏలాంటి సమస్య రాకుండా చూసుకోవడంతో ఈ విషయం ఇన్నాళ్ల వెలుగులోకి రాలేదని ఆరోపించారు. ఉపాధి పనుల్లో అక్రమాలకు పాల్పడ్డ అధికారులపై కలెక్టర్ విచారణచేసి చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు.

పరిహారం అందించాలి

నర్వ: అర్హులైన రైతులకు ప్రభుత్వం అందించే పంటనష్ట పరిహారం అందించాలని రాయికోడ్ రైతులు రామంజనేయులుగౌడ్ తదితరులు డిమాండ్ చేశారు. పంటనష్ట పరిహారం కోసం గ్రామంలోని పంటపొలాలను సర్వేచేసిన వ్యవసాయ అధికారులు, అర్హులకు కాకుండా పంటలు వేయని వారికి సైతం పంటనష్ట పరిహారం అందించే జాబితాలో పేర్లు రావడమేమిటని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రెండుసార్లు సర్వే చేసినప్పటికి నష్టపోయిన రైతులకు పరిహారం జాబితాలో పేర్లు లేవని వారన్నారు. దీనిపై వ్యవసాయ అధికారులు ఏఈఓ, ఏఓలకు ఫిర్యాదు చేస్తే వారు అర్హులకే ఇచ్చామని సమాధానం దాటవేస్తున్నారన్నారు. ఉన్నతాధికారులు సమగ్ర విచారణ చేసి శాఖపరమైన చర్యలు తీసుకోవాలని బాధిత రైతులు కోరుతున్నారు.

పర్యావరణ పరిరక్షణలో భాగం కావాలి



మొక్కలు నాటుతున్న సీజీఆర్ ఫౌండర్ లక్ష్మారెడ్డి

మరికల్: భవిష్యత్‌లో మానవుని మనుగడ కోసం పర్యావరణ పరిరక్షణ కోసం భూమాతను కాపాడుకోవాల్సిన బాధ్యత మన అందరిపై ఉందని సీజీఆర్ ఫౌండర్ లక్ష్మారెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని కన్మనూర్‌లో జెడ్పీ ఉన్నత పాఠశాలలో ప్రభుత్వ విద్యాశాఖ ఆధ్వర్యంలో స్కూల్ ఎర్త్ క్లబ్ యంగ్ ఎర్త్ లీడర్ ప్రోగ్రాం నిర్వహించారు. 6నుంచి 9వ తరగతి విద్యార్థుల్లో ఇద్దరి చొప్పున ఎన్నుకుని ఈ కమిటీలు వేసి వారు పర్యావరణ పరిరక్షణలో భాగం కావాలని సూచించారు. భావి తరాలకు ప్రకృతిని ఇవ్వాల్సిన బాధ్యత విద్యార్థులపై ఉందన్నారు. భవిష్యత్‌లో మానవుని మనుగడ ముందుకు సాగలాంటే కలుషితమవుతున్న వాతావరణంలో పుడమి తల్లిని కాపాడుకునే నాయకులు కావాలని విద్యార్థులకు పిలుపునిచ్చారు. అలాగే మొక్కలు పెంచేవిధానం ఔషధ మొక్కల ఉపయోగంపై ఎంతో అవసరమన్నారు. దీంతో పాటు ప్లాస్టిక్ నివారణకు కూడా అందరం సహకరించుకోవాలని సూచించారు. అనంతరం పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. కరస్పాడెంట్ వెంకటేశ్వర్లుశర్మ, యువక మండలి అధ్యక్షుడు రవికిరణ్, రాజేష్, రాఘవేంద్ర, వినితమ్మ, రామాంజనేయులు, నాగేష్ పాల్గొన్నారు.

పిల్లల దత్తతపై ఆశ వర్కర్లకు అవగాహన



అవగాహన కల్పిస్తున్న బాలల సంరక్షణ కేంద్ర అధికారి కరిష్మా

మద్దూరు: పిల్లలు లేని వారు చట్టపరంగా పిల్లలను దత్తత తీసుకోవడం ఎలా అనే అంశాన్ని బాలల రక్షణ విభాగం ప్రోటెక్షన్ అధికారి కరిష్మా మండల ఆశ, వైద్య సిబ్బందికి అవగాహన కల్పించారు. శుక్రవారం మండల కేంద్రంలోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో ఈ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. చట్టవిరుద్ధంగా పిల్లలను దత్తత తీసుకుంటే వారికి 3 ఏళ్ల జైలు శిక్షతోపాటు లక్ష రూపాయల జరిమానా విధించడం జరుగుతుందని పేర్కొన్నారు. పిల్లలు అవసరమున్న వారు జిల్లా కేంద్రంలోని బాలల సంరక్షణ కేంద్రంలో సంప్రదించాలని సూచించారు. ఎవరైనా పిల్లలను అమ్మడం, కొనడం గాని జరుగకుండా చూడాలని పేర్కొన్నారు. అలాగే బాల్యవివాహాల నిర్మూలన, బాలలపై జరిగే లైంగిక దాడులు, వాటి నుంచి రక్షణ పొందే చట్టాలను వివరించారు. కార్యక్రమంలో డాక్టర్లు శ్రీలత, విజయ, నరేష్, చైల్డ్ లైన్ కో –ఆర్డినేటర్ నర్సింహ తదతరులు పాల్గొన్నారు.

బస్సులు మళ్లిస్తే ఆందోళన చేస్తాం



వినతిపత్రం అందిస్తున్న ఎస్‌ఎఫ్‌ఐ విద్యార్థులు

నారాయణపేట రూరల్: విద్యార్థుల కోసం ఏర్పాటుచేసిన ఆర్టీసీ బస్సులను దారి మళ్లించి లాభార్జన కోసం ప్రయత్నం చేస్తే ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో ఆందోళన చేస్తామని ఆ సంఘం జిల్లా కో–కన్వీనర్ నరేష్ హెచ్చరించారు. శుక్రవారం స్థానిక డిపోలో ట్రాఫిక్ అధికారిణి శ్రీశైలమ్మను కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం మాట్లాడుతూ ఆర్టీసీ సేవ ద్రుక్పథాన్ని పక్కనపెట్టి లాభార్జనే ధ్యేయంగా పని చేయడం సిగ్గుచేటు అన్నారు. విద్యాసంస్థలు ప్రారంభమై నాలుగు రోజులు గడిచిన జిల్లాలో పలు గ్రామాలకు ఆర్టీసీ బస్సులను పంపకుండా నిలిపివేయడం అధికారుల తీరు సరికాదన్నారు. వెంటనే అన్ని గ్రామాలకు సరిపడా బస్సులను ఏర్పాటు చేయడంతో పాటు, విద్యాసంస్థల వేళకు నడిచే విధంగా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో భానుప్రసాద్, శివకుమార్, బాలకృష్ణ, నరేష్, అశోక్ కార్యకర్తలు పాల్గొన్నారు.

బీజేపీ సభ్యత్వ నమోదు



మరికల్‌లో సభ్యత్వ నమోదు చేయిస్తున్న నాయకులు

మరికల్: గ్రామ స్థాయిలో బీజేపీ పార్టీని బలోపేతం చేయడం కోసం సభ్యత్వ నమోదు చేపట్టినట్లు పార్టీ జిల్లా అధికార ప్రతినిధి నర్సన్‌గౌడ్, సభ్యత్వ మండల కన్వీనర్ వేణుగోపాల్ అన్నారు. శుక్రవారం బీజేవైఎం ఆధ్వర్యంలో మండలంలోని మాధవరంలో సభ్యత్వ నమోదు చేయించారు. ప్రతి గ్రామంలో ఈ కార్యక్రమం కొనసాగించి, రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో అధిక స్థానల్లో సర్పంచ్‌లు, ఎంపీటీసీలను కైవసం చేసుకుంటామన్నారు. కార్యక్రమంలో వేణు, శ్రీరాం, వెంకటేష్, నరేష్‌గౌడ్, మహేష్‌శెట్టి, ఆంజనేయులు, కర్మన్న, సాయికిశోర్ పాల్గొన్నారు.

ధన్వాడ: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రతి పథకం లబ్ధిదారులకు అందేలా కార్యకర్తలు కృషిచేయాలని కిసాన్ మోర్చా రాష్ట్ర కార్యదర్శి గోవర్ధన్‌గౌడ్ అన్నారు. శుక్రవారం మండలంలోని హన్మన్‌పల్లిలో సభ్యత్వ నమోదు చేపట్టారు. కార్యక్రమంలో రాఘవేందర్‌గౌడ్, శ్రీనివాస్, సంజీవరెడ్డి, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

వాల్‌పోస్టర్ విడుదల

మరికల్: హైదరాబాద్‌లో ఈ నెల 20న నిర్వహించే సంఘటిత, ఆ సంఘటిత రంగాల్లో పనిచేస్తున్న కార్మికుల విలీన సదస్సుకు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను శుక్రవారం మండలంలోని ఐఎఫ్టీయూ ఆధ్వర్యంలో విడుదల చేశారు. ఈ మేరకు.. ఐఎఫ్టీయూ జిల్లా కార్యదర్శి రామంజనేయులు మాట్లాడుతూ.. మండలం నుంచి అధిక సంఖ్యలో కార్మిక సంఘాల నాయకులు, కార్మికులు తరలి వచ్చి జయప్రదం చేయాలని కోరారు. నాయకులు బాలయ్య, రాజన్న, కుర్మక్క, సరోజ తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో నవరాత్రి ముగింపు ఉత్సవాలు



వేలంలో అమ్మవారి చీరలు పంపిణీ

దామరగిద్ద: మండల కేంద్రంలోని భవాని మాత ఆలయంలో దసరా శరన్నవరాత్రి ముగింపు ఉత్సవాలను శుక్రవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఎస్‌ఎస్‌కే సమాజ్ ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ మేరకు.. భక్తులు సమర్పించిన చీరలను మహిళలు వేలం నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేపట్టారు. కార్యక్రమంలో సమాజ్ సభ్యులు మహిళలు పాల్గొన్నారు.

బాపుబాటలో నడుద్దాం..



విజయ్‌కుమార్‌ను సన్మానిస్తున్న గ్రామస్తులు

నర్వ: విద్యార్థుల భవిష్యత్ బాగుపడాలంటే బాపు సూచించిన మార్గంలో నడుద్దామని విశ్రాంత డీఈఓ శివార్థక విజయ్‌కుమార్ అన్నారు. బాపుబాటలో.. సత్యశోధన పాదయాత్రలో భాగంగా శుక్రవారం మండలం పెద్దకడ్మూర్‌లో కొనసాగింది. ఈ మేరకు.. ర్యాలీగా వచ్చిన ఆయన స్థానిక జెడ్పీహెచ్‌ఎస్ స్కూల్‌లో విద్యార్థులనుద్దేశించి మాట్లాడారు.. సాయంత్రం స్థానిక అంజనేయస్వామి ఆలయంలో ఆయనను గ్రామస్తులు శాలువాతో సన్మానించారు. ఆయన మాట్లాడుతూ.. ఈ నెల 2న అలంపూర్‌లో ప్రారంభించిన పాదయాత్ర, 17వ రోజు పెద్దకడ్మూర్‌లో కొనసాగిందన్నారు. శనివారం రోజు నర్వ, పాథర్చేడ్ గ్రామాల్లో పాదయాత్ర కొనసాగుతుందన్నారు. కార్యక్రమంలో పాఠశాల జీహెచ్‌ఎం భాగ్యలక్ష్మి, గ్రామస్తులు బల్‌రాంగౌడ్, లింగన్న, రామన్‌గౌడ్, తంబలి నర్సింహయ్య, భాస్కర్‌గౌడ్, సత్యన్న, గోవిందు, హన్మంతు పాల్గొన్నారు,

పశువులకు గాలికుంటు టీకాలు వేయించాలి



మరికల్‌లో టీకా వేస్తున్న పశువైద్య సిబ్బంది

మరికల్: ముందుజాగ్రత్తగా పశువులకు గాలికుంటు టీకాలు వేయించుకోవాలని జిల్లా పశువైద్యాధికారి బండ ఈశ్వర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని పస్పులలో ఆయన పశువులకు గాలికుంటు టీకాలు వేశారు. ఆయా గ్రామాల పశువుల కాపరులు ముందు జాగ్రత్తగా తమ పశువులకు ఈ టీకాలను వేయించాలని సూచించారు. కార్యక్రమంలో జూనియర్ పశువైద్యాధికారి వాసుదేవుడు, గోపాలమిత్ర శ్రీనివాస్‌గౌడ్ పాల్గొన్నారు.

కృష్ణా: మండలంలోని మురహర్‌దొడ్డిలో శుక్రవారం పశువైద్యాధికారులు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేశారు. ఈ మేరకు వారు మాట్లాడుతూ.. ఈ అవకాశాన్ని రైతులు తప్పనిసరిగా ఉపయోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో లింగప్ప, హన్మంతు, రామకృష్ణా పాల్గొన్నారు.

మాగనూర్: గాలికుంటు వ్యాధి నివారణ టీకాలను రైతులు ఉపయోగించుకోవాలని వెటర్నరి అసిస్టెంట్ శశికుమార్ అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని అమ్మపల్లి, వడ్వాట్ గ్రామాల్లో కొనసాగుతున్న టీకాల కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో పశువైద్య సిబ్బంది పాల్గొన్నారు.